సాక్షి సంగారెడ్డి

సోమవారం ✦ 6 ✦ మే ✦ 2024



తస్మాత్ జాగ్రత్త

ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో సోషల్ మీడియాపై పోలీసులు, జిల్లా ఎన్నికల యంత్రాంగం దృష్టి సారించింది.

వివరాలు IIలో ▸



కారు దిగి కాంగ్రెస్‌లోకి..

పార్లమెంట్ ఎన్నికల వేళ గులాబీ పార్టీకి వరుస ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. కీలక నేతలు పార్టీకి గుడ్ బై చెబుతున్నారు.

వివరాలు IIలో ▸



'ఆమె'దే ఆధిక్యం..

జహీరాబాద్ లోక్‌సభ పరిధిలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. వీరే అభ్యర్థుల గెలుపోటములు నిర్ణయించనున్నారు.

వివరాలు IIIలో ▸

న్యూస్‌రీల్

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

పటాన్‌చెరు టౌన్: కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి, అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం మెదక్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఎంతో అభివృద్ధి జరిగిందని, ఆరోగ్యశ్రీ, 108 ఇలా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మాణిక్యం, డీసీసీ కార్యదర్శి సామయ్య, నాయకులు ఎట్టయ్య, అతిక్ సాయిలు, శ్రీనివాస్, ఆంజనేయులు, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అబద్ధాలతో గద్దెనెక్కారు



ప్రచారంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ప్రజలకు కల్లబొల్లి మాటలు చెప్పి, ఆచరణకు సాధ్యంకాని హామీలిచ్చి కాంగ్రెస్ గద్దెనెక్కిందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ విమర్శించారు. ఆదివారం మండల పరిధిలోని ఇశ్రితాబాద్ గ్రామంలో మెదక్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామి రెడ్డికి మద్దతుగా పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'కాంగ్రెస్ రావడంతో కరెంటు పోయిందని, కష్టాలు వచ్చాయని, సంక్షేమ ఫలాలు మాయమయ్యాయని ఎద్దేవా చేశారు. అబద్ధాల కాంగ్రెస్ పై పోరాటం చేయాలంటే బీఆర్ఎస్ ఎంపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాసాల బుచ్చిరెడ్డి, ఆంజనేయులు, యాదమ్మ కిష్టయ్య, రత్నాకర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రాములు, బాబుమీయ పాల్గొన్నారు.

సిద్దిపేటలో జగ్గారెడ్డి రోడ్ షో

సిద్దిపేటజోన్: పట్టణంలో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి రోడ్‌షో నిర్వహించారు. ఆదివారం మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా ప్రచారం చేశారు. జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్ లో జగ్గారెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉంటే పోరాటం, అధికారంలో ఉంటే శాసించడమే రాజకీయమని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కేసులు ఎదుర్కొన్నారని, కాంగ్రెస్ పార్టీ సంజీవిని లాంటిదన్నారు. నీలం మధును భారీ మెజారిటీతో గెలిపించాలని, సమస్యలు లేకుండా చూస్తామని అన్నారు. ర్యాలీలో నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి హరికష్ణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గూడూరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిప్పుల కొలిమి

మెదక్‌జోన్: ఎండలు మండిపోతున్నాయి. జిల్లాలో 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. జిల్లాలో ఇప్పటికే వడదెబ్బతో ఇద్దరు మృత్యువాత పడ్డారని అధికారులు పేర్కొన్నారు. దీంతో జనం బయటకు రావడానికే జంకుతున్నారు. ఇళ్లలో ఉన్నా వేడి తీవ్రతను తట్టుకోలేక అల్లాడుతున్నారు. ఉపాధి కూలీలు ఉద యం 6 గంటల నుంచి 11 గంటల వరకు మాత్రమే పనులు చేసి ఇళ్లకు చేరుకుంటున్నారు. అత్యవసరమైతేనే బయటకు వెళ్లా లని వైద్యులు సూచిస్తున్నారు. చిన్నపిల్లలు, వయోవృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నారు.







ఈత.. కేరింత

ఎండలు దంచికొడుతున్నాయి.. భానుడి భగభగలకు జనం బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. వేడిమి నుంచి ఉపశమనం పొందడానికి కొందరు స్విమ్మింగ్ పూళ్లను ఆశ్రయిస్తున్నారు. ఆదివారం సంగారెడ్డి రాజీవ్ పార్క్ వెనకాల ఉన్న స్విమ్మింగ్ పూల్ కిటకిటలాడింది. పిల్లలు, పెద్దలు వచ్చి ఈత కొడుతూ కేరింతలు కొట్టారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

కౌంట్‌డౌన్..!

సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి గడువు కేవలం ఆరు రోజులు మాత్రమే మిగిలింది. పోలింగ్‌కు 48 గంటల ముందే అభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని నిలిపివేయాల్సి ఉంటుంది. ఈనెల 13న పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో 11వ తేది సాయంత్రం ఐదు గంటలకు ప్రచార పర్వానికి తెరపడనుంది. దీంతో అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. తక్కువ సమయంలో ఎక్కువ మంది ఓటర్లను కలిసేలా తమ ప్రచార తీరును మార్చుకుంటున్నారు. ఇన్నాళ్లు కార్యకర్తల సమావేశాలు, సభలు నిర్వహించిన ప్రధాన పార్టీలు.. ఇప్పుడు ప్రధాన పట్టణాలు, మండల కేంద్రాల్లో రోడ్‌షోలను నిర్వహిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా ఇంటింటి ప్రచారం నిర్వహించేందుకు లోక్‌సభ ఎన్నికల్లో వీలు పడదు. లోక్‌సభ నియోజకవర్గ పరిధి విస్తృతంగా ఉండటంతో పాటు, ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉంటాయి. దీంతో తక్కువ సమయంలో ఎక్కువ మందితో మమేకమయ్యేలా తమ ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు.

- సాక్షిప్రతినిధి, సంగారెడ్డి

ప్రచారానికి మిగిలింది
ఆరు రోజులే..

- క్యాంపెయిన్ జోరు పెంచిన ప్రధాన పార్టీలు
- 7 నుంచి జిల్లాలో కేసీఆర్ రోడ్‌షోలు..!
- అదే రోజు నర్సాపూర్‌కు ప్రియాంకగాంధీ
- బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలతో కమలం పార్టీ సమావేశాలు?



కేసీఆర్ రోడ్ షోలు..

ఎన్నికల ప్రచారానికి గడువు ముగిసే చివరి తరుణంలో మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు జిల్లాలో రోడ్‌షో నిర్వహించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. మెదక్ లోక్‌సభ పరిధిలోని ఈ రోడ్ షో కొనసాగుతుందని ఆ పార్టీ వర్గాలు ఇప్పటికే షెడ్యూల్‌ను ప్రకటించాయి. ఈనెల 7న మెదక్ పట్టణంలో రోడ్ షో ఉంటుంది. కేసీఆర్ రాత్రి ఇక్కడే బస చేస్తారు. 8న నర్సాపూర్, పటాన్‌చెరులో ఈ రోడ్‌షో కొనసాగుతుంది. తర్వాత 10వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు సిద్దిపేట్‌లో రోడ్‌షో నిర్వహించనున్నారు. ఈ మేరకు గులాబీ శ్రేణులు రోడ్‌షోను విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కేసీఆర్ ఎన్నికల ప్రచారానికి 48 గంటలు బ్రేకు పడిన నేపథ్యంలో ఈ షెడ్యూల్‌లో మార్పులుండే అవకాశాలున్నాయి.

నర్సాపూర్‌కు ప్రియాంక గాంధీ

ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత ప్రియంక గాంధీ ఈనెల 7న నర్సాపూర్‌కు రానున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా పట్టణ శివారులో నిర్వహించనున్న బహిరంగ సభలో ఆమె పాల్గొంటారని కాంగ్రెస్ పార్టీ వర్గాలు ప్రకటించాయి. ఉదయం 11 గంటలకు జరిగే ఈ సభకు జిల్లా నలుమూలల నుంచి జనాలను, పార్టీ శ్రేణులను తరలించేందుకు కాంగ్రెస్ కసరత్తు చేస్తోంది.

బీజేపీ ముఖ్యమంత్రులతో మీటింగ్‌లు

బీజేపీ కూడా ఎన్నికల ప్రచారంలో దూకుడు పెంచింది. ఉన్న కొద్ది సమయాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ప్రయత్నం చేస్తోంది. బీజేపీ పాలిత రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులతో జిల్లాలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. రాజస్థాన్, మధ్యప్రదేశ్ సీఎంలలో ఒకరిని జిల్లాకు రప్పించాలని భావిస్తోంది. ఈ ముఖ్యమంత్రుల పర్యటన ఇంకా ఖరారు కావాల్సి ఉంది. ఈ సీఎంల మీటింగ్‌లు ఎక్కడెక్కడ నిర్వహించేది ఇంకా నిర్ణయించలేదని కమలం పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.



హాయ్.. ఐయామ్ ఈవీఎం

వారం రోజుల్లో లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు వారు కృషి చేస్తున్నారు. నియోజకవర్గాల్లో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఈవీఎం, వీవీ ప్యాట్ నమూనాలు ఆకట్టుకుంటున్నాయి. కలెక్టరేట్‌కు వచ్చిన ప్రతీఒక్కరు వీటిని ఆసక్తిగా చూస్తున్నారు. - సంగారెడ్డి టౌన్

ప్రశాంతంగా నీట్ ప్రవేశ పరీక్ష

కొండాపూర్(సంగారెడ్డి): దేశ వ్యాప్తంగా వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ (నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్) పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష కొనసాగింది. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని అధికారులు ఉదయం 10.30 గంటల నుంచే విద్యార్థులను పరీక్ష కేంద్రాలలోకి అనుమతించారు. పరీక్షకు 3619 మందికి గాను 3556 మంది హాజరయ్యారు. 63 మంది గైర్హాజరయ్యారు. పట్టణంలోని ఎస్వీ జూనియర్ కళాశాలలో 672 మందికి గాను 661 మంది, కరుణా హైస్కూల్లో 504 మందికి 500, సెయింట్ పీటర్స్ 480 మందికి 473, సెయింట్ ఆంథోనీస్ జూనియర్ కళాశాలలో 360 మందికి 357, సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్లో 360 మందికి 357మంది హాజరయ్యారు. అలాగే సెయింట్ ఆంథోనీస్ డిగ్రీ కళాశాలలో 360 మందికి 351, పయనీర్స్ స్కూల్లో 312 మందికి 307, అర్నాల్డ్ హైస్కూల్లో 288 మందికి 282, రిషి హైస్కూల్లో 283 మందికి 268 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు నీట్ జిల్లా సమన్వయకర్త జ్యోతిరెడ్డి తెలిపారు.



విద్యార్థుల హాల్‌టికెట్లు పరిశీలించి పరీక్ష కేంద్రాల్లోకి పంపిస్తున్న అధికారులు

ఓట్ల కోసమే మత రాజకీయాలు

- కుటుంబ పాలన సాగించిన బీఆర్ఎస్
- అభివృద్ధి చూసి కాంగ్రెస్‌ను ఆదరించండి
- ప్రతీ కార్యకర్తను కాపాడుకుంటా..
- మంత్రి దామోదర

మునిపల్లి(అందోల్): ప్రతీ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వారి కుటుంబ సభ్యులను వైద్య, విద్యపరంగా ఆదుకుంటానని మంత్రి దామోదర రాజనర్సింహ హామీ ఇచ్చారు. ఆదివారం మునిపల్లిలోని ఓ ఫంక్షన్‌హాలులో పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ యువతకు, మహిళలకు 50 శాతం పదవులు, అధికారం అందించేందుకు కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అందోల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.500 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. అంతేకాకుండా మునిపల్లి మండలం బుదేరా నుంచి మునిపల్లి చౌరస్తా, తక్కడపల్లి, గార్లపల్లి, అస్నాబాద్, సీరూర్ వరకు డబుల్ రోడ్డు ఏర్పాటుకు రూ.80 కోట్లు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. గతంలో మోడల్ స్కూల్, మహిళా డిగ్రీ కళాశాలతో పాటు ప్రస్తుతం కంకోల్ చౌరస్తా సమీపంలో ఆస్పత్రిని ఇంతకు ముందే మంజూరు చేయడం జరిగిందన్నారు. గతంలో, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఆదరించాలని మంత్రి పిలుపునిచ్చారు. ఆరు గ్యారెంటీలలో ఐదు అమలు చేయడం చేశామని పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు చెప్పే మాయమాటలు నమ్మి మోసపోవద్దని, అభివృద్ధి చేసే కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు.



మాట్లాడుతున్న మంత్రి దామోదర

బీజేపీ, బీఆర్ఎస్ దొందూ దొందే..

బీజేపీ మతం పేరుతో ప్రజలను మభ్యపెడుతూ అధికారం కోసం పాకులాడుతుందని ఆరోపించారు. పదేళ్ల నుంచి తెలంగాణకు చేసిందేమీ లేదన్నారు. దేవుళ్లను రాజకీయం చేస్తు ఓట్లు దండుకోవడం కోసం బీజేపీ ప్రయత్నిస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంను నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఏర్పాటు చేస్తే.. బీఆర్ఎస్ ప్రభుత్వం కుటుంబ పాలన సాగించి దోచుకుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్, మాజీ ఎంపీపీ రాంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సతీష్ కుమార్ పాల్గొన్నారు.

గేటెడ్ కమ్యూనిటీలపై నజర్

- ఓట్ల వేటలో లోక్‌సభ అభ్యర్థులు
- కాలనీలలో ప్రత్యేక సమావేశాలు
- హోరాహోరీగా హామీలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు రామచంద్రాపురం, పటాన్‌చెరు, అమీన్‌పూర్ పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీ కాలనీలపై నజర్ పెట్టారు. వివిధ కాలనీలలో నివాసం ఉండే వారి అనుచరులతో, ప్రతినిధులతో మాట్లాడి ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. కాలనీ వాసులు చెప్పే సమస్యలు విని వాటిని పరిష్కరిస్తామని హామీలు గుప్పిస్తున్నారు. రామచంద్రాపురం, పటాన్‌చెరు, అమీన్‌పూర్ పరిధిలలో సుమారు 75పైగా గేటెడ్ కమ్యూనిటీ కాలనీలున్నాయి. అక్కడ అభివృద్ధి బాగానే ఉన్నప్పటికీ కొన్ని కాలనీలలో సరైన మార్గాలు లేకపోవడం, డ్రైనేజీ, తాగు నీటి సమస్యలున్నాయి. గేటెడ్ కమ్యూనిటీ కాలనీలలో సుమారు 2లక్షల మంది ఓటర్లున్నారు. ఈ కాలనీలలో ఉమ్మడి రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన వారు నివాసం ఉంటున్నారు. ఎక్కువగా ఐటీ నిపుణులే ఉన్నారు. వారిని తమవైపు ఎలా తిప్పుకోవాలా అని అభ్యర్థులు తర్జనభర్జన పడుతున్నారు. అన్ని కాలనీలలో పర్యటిస్తూ హామీల జల్లు కురిపిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఓటింగ్ శాతం పెంచడానికి ర్యాలీలు సైతం తీశారు. గేటెడ్ కమ్యూనిటీల కారణంగా ఈ ప్రాంతంలో ఓటర్ల సంఖ్య పెరిగిందని చెప్పవచ్చు. కానీ కొంతమంది వారి సొంత ప్రాంతాలు, గ్రామాలపై ఉన్న మమకారంతో వారి ఓటును అక్కడే కొనసాగిస్తున్నారు. ఎప్పుడూ చాలా ప్రశాంతంగా ఉండే ఈ కాలనీల్లో ఎన్నికల సందర్భంగా అభ్యర్థుల ప్రచారాలతో సందడి వాతావరణం నెలకొంది. ఇక గేటెడ్ కమ్యూనిటీ కాలనీవాసులు ఎవరికి ఓటు వేస్తారో వేచి చూడాలి.



కాంగ్రెస్‌ది రివర్స్ గేర్ పాలన

మాజీ మంత్రి హరీశ్‌రావు

తూప్రాన్: అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పాలనలో ప్రజల సమస్యలు పరిష్కారం కావడం లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఆదివారం రాత్రి తూప్రాన్ పట్టణ కేంద్రంలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఐదు నెలల కాంగ్రెస్ పాలన రివర్స్ గేర్‌లా ఉందని ఎద్దేవా చేశారు. కరెంట్ సమస్యలు మళ్లీ ప్రారంభమయ్యాయని అన్నారు. కరోనా కష్టాల్లో కూడా రైతుబంధు వేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. కాంగ్రెస్ బోగస్ మాటలు నమ్మి ఓట్లు వేస్తే ప్రజలు నష్టపోతారని పేర్కొన్నారు. హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. గ్యాస్, పెట్రోల్ ధర పెంచిన బీజేపీకి ఓటు వేస్తే చెత్తలో వేసినట్లేనని అన్నారు. దేవుడి పేరుతో రాజకీయం చేసి ఓట్లడిగే వాళ్లని నమ్మి మోసపోవద్దని సూచించారు. రిజర్వేషన్లు తీసి వేసే కుట్ర చేస్తున్న బీజేపీకి ఓటు వేస్తారా..? తెలంగాణను అభివృద్ధి చేసే బీఆర్ఎస్‌కు ఓటు వేస్తారా అని ప్రశ్నించారు. మెదక్‌లో కాంగ్రెస్‌కు మూడో స్థానం ఖాయమన్నారు. బీఆర్ఎస్ బీజేపీతో కలిసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. గజ్వేల్‌కు పూర్వ వైభవం రావాలంటే బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హరీశ్‌రావు

రుణమాఫీ చేస్తామని మోసం చేశారు

రామాయంపేట(మెదక్): అధికారంలోకి కాగానే రూ. రెండు లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ నాయకులు మోసం చేశారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఆదివారం రాత్రి రామాయంపేటలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు పూర్తిస్థాయిలో అమలు చేస్తామని చెప్పి చేయలేదన్నారు. ప్రశ్నించే గొంతును గెలిపిస్తే అన్ని పనులు అవుతాయని పేర్కొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఓట్లతో బుద్ధి చెప్పండి

పటాన్‌చెరు టౌన్: మాయమాటలతో మభ్యపెట్టేందుకు వస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఓట్ల ద్వారా ప్రజలు బుద్ధి చెప్పాలని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం రాత్రి పటాన్‌చెరు మండల పరిధిలోని ముత్తంగి నుంచి ఇస్నాపూర్ చౌరస్తా వరకు రోడ్ షో నిర్వహించి, అనంతరం ఇస్నాపూర్‌లో కార్నర్ మీటింగ్ నిర్వహించి మాట్లాడారు. పదేళ్ల బీజేపీ పాలనలో దేశం అన్నివిధాలుగా అభివృద్ధి చెందిందన్నారు. మోదీ దేశ ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా పెంచారన్నారు. ప్రజల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు గోదావరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రఘునందన్‌రావు

అభివృద్ధి కోసం షెట్కార్‌ను గెలిపించండి

ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: జహీరాబాద్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి కోరారు. మండలంలోని చందర్‌నాయక్ తండా, హంగిర్గా (కె), హంగిర్గా (బి), అల్లాపూర్, నాగాపూర్ గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఐదింటిని అమలు చేసిందన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగాల కల్పనకు పరిశ్రమలు ఏర్పాటు చేయనున్నట్లు సీఎం హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు వినోద్ పాటిల్, బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాహెర్ పాల్గొన్నారు.

నిజాంపేట్‌లో..

మండల కేంద్రమైన నిజాంపేట్‌తోపాటు దామర్ చెరువు, ఖానాపూర్ (బి) గ్రామాల్లో జిల్లా ప్రణాళికా సంఘం మాజీ సభ్యులు నగేష్ షెట్కార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సురేష్ షెట్కార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు విజ్ఞప్తి చేశారు. మాజీ ఎంపీపీ మల్లేశం, కాంగ్రెస్ అధ్యక్షులు పోచయ్య, శంకర్‌గౌడ్, దేవదాస్ పాల్గొన్నారు.



ఖేడ్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

క్లుప్తంగా

ఆరు గ్యారంటీల పేరుతో మోసం

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): ఆరుగ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. భువనగిరి ఎంపీ బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశం కురుమకు మద్దతుగా ఉమ్మడి మద్దూరు మండలంలోని లద్నూర్, ధర్మారం, సలాఖ్‌పూర్, నర్సాయిపల్లి, గాగిళ్లాపూర్, వల్లంపట్ల, భైరన్‌పల్లి గ్రామల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరుగ్యారంటీల హామీలను నెరవేర్చకుండా సీఎం రేంవత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్లు వేస్తూ ఓట్లు అడుగుతున్నారని విమర్శించారు. కేంద్రంలో తమ వాటా తీసుకురాగలిగే అభ్యర్థులను పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలని, భువనగిరి ఎంపీ అభ్యర్థిగా క్యామ మల్లేశంను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ మల్లిపెద్ది సుమలత మల్లేశం, బీఆర్‌ఎస్ మండలాల అధ్యక్షులు మేక సంతోష్, మంద యాదగిరి, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి, ఎంపీటీసీ సమ్మయ్య, నర్సింలు, మాజీ సర్పంచ్‌లు భాస్కర్‌రెడ్డి, సుందరగిరి స్రవంతి పరశురాములు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం తప్పదు

బీఆర్‌ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్



రోడ్‌షోలో అనిల్‌కుమార్, భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): ఆశీర్వదిస్తే జహీరాబాద్ పార్లమెంట్ పరిధిని అభివృద్ధి చేసి చూపిస్తానని బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ అన్నారు. ఆదివారం రాత్రి పెద్ద శంకరంపేటలో రోడ్‌షో అనంతరం గాంధీ చౌక్ వద్ద కార్నర్ మీటింగ్ నిర్వహించారు. పట్టణ పురవీధుల గుండా భారీ ర్యాలీ చేపట్టారు. ఎన్నికలలో కాంగ్రెస్, బీజేపీలకు ఓటుతో గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, ట్రేడ్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ మఠం భిక్షపతి, ఎంపీపీ జంగం శ్రీనివాస్, జెడ్పీటీసీ విజయరామరాజు, వైస్ ఎంపీపీ లక్ష్మీరమేశ్, రైతుబంధు మాజీ అధ్యక్షుడు సురేశ్ గౌడ్, నాయకులు ఎంపీటీసీ దత్తు, మాణిక్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, ప్రకాశ్, యాకుబ్ పాల్గొన్నారు.



ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో సోషల్ మీడియాపై పోలీసులు, జిల్లా ఎన్నికల యంత్రాంగం దృష్టి సారించింది. ట్విటర్, ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి సోషల్ మీడియా వేదికగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, పోస్టులు పెట్టినా కఠిన చర్యలు తీసుకునేందుకు సిద్ధమైంది. చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంది కదా అని ఇష్టానుసారంగా అభ్యంతర వీడియోలు, ఫొటోలు అప్‌లోడ్ చేస్తుంటారు. వీటిని ఎలాగైనా కట్టడి చేయాలనే ఉద్దేశ్యంతో ఎన్నికల సంఘం చర్యలకు పూనుకుంది. ఇందులో భాగంగానే జిల్లా కలెక్టరేట్‌లో మీడియా మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేశారు.

- కొండాపూర్ (సంగారెడ్డి) / సంగారెడ్డి టౌన్

తస్మాత్ జాగ్రత్త

సోషల్ మీడియాపై ఎన్నికల అధికారుల నజర్

- కట్టడి చేసేందుకు ప్రత్యేక దృష్టి
- వివాదాస్పద పోస్టులు పెడితే కఠిన చర్యలు
- పోలీసులు, ఎన్నికల అధికారుల పరిశీలన
- సంగారెడ్డి కలెక్టరేట్‌లో మీడియా మానిటరింగ్ సెల్ ఏర్పాటు

లోక్‌సభ ఎన్నికల సమరానికి మరో 8 రోజులు మాత్రమే ఉంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ గెలుపే లక్ష్యంగా ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇప్పటికే బహిరంగ సభలు, రోడ్డు షోలు, కార్నర్ మీటింగ్‌లు నిర్వహిస్తూ ఓటర్లను ఆకట్టుకోవడానికి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ప్రధానంగా సోషల్ మీడియాను ఎక్కువగా వినియోగించుకుంటున్నారు. ప్రచారంలో భాగంగా అన్ని పార్టీల నాయకులు పార్టీల పేరు మీద, అభ్యర్థుల పేర్ల మీద ప్రత్యేక వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ తదితర ఖాతాలు ప్రారంభించి గ్రూపులను ఏర్పాటు చేస్తున్నారు. ఈ గ్రూపుల్లో స్థానిక యువత, వివిధ వర్గాల ప్రజలను సభ్యులుగా నమోదు చేస్తున్నారు. ఇలా ప్రతి రోజూ గ్రామాల్లో పట్టణాల్లో చేస్తున్న ప్రచార చిత్రాలు, వీడియోలను సోషల్ మీడియా యాప్‌లలో ఎప్పటికప్పుడూ అప్‌లోడ్ చేస్తున్నారు. అయితే ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో సోషల్ మీడియాలోనూ వివిధ పార్టీల నాయకులు విమర్శలు, ఆరోపణలతోపాటు అభ్యంతరమైన పోస్టులు పెడుతున్నారు.

మానిటరింగ్ సెల్ ఏర్పాటు

సోషల్ మీడియాలో అభ్యంతర పోస్టులు పెడితే వాటిని కట్టడి చేసే విధంగా ఎన్నికల సంఘం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని కలెక్టరేట్ మీడియా మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేశారు. ఎన్నికల బరిలో నిలిచిన వివిధ పార్టీల నాయకులు, వారి అనుచరులు సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తున్న పోస్టులను, ప్రచార కార్యక్రమాలను అణువణువు పరిశీలించేందుకు మానిటరింగ్ బృందాలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో కలెక్టర్, అదనపు కలెక్టర్, పోలీసు సిబ్బంది, సోషల్ మీడియా నిపుణుడు, రిపోర్టర్, సీనియర్ సిటిజన్, జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి సభ్యులుగా ఉన్నారు. వీరు ప్రతి రోజూ వివిధ దిన పత్రికలో వచ్చే వార్తలను పరిశీలించడంతోపాటు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న రాజకీయ అంశాలను పరిశీలిస్తారు. ఎన్నికల సంఘానికి విరుద్ధంగా రెచ్చగొట్టే ప్రసంగాలు, విమర్శలు నమోదు చేసిన సంబంధిత వాట్సాప్ గ్రూపు అడ్మిన్‌ను, పోస్టులు నమోదు చేసిన వ్యక్తికి నోటీసులు జారీ చేయడంతోపాటు విచారణ నిర్వహించి చర్యలు తీసుకుంటామని సంబంధిత శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.



మీడియా మానిటరింగ్ సెల్‌ను పరిశీలిస్తున్న ఈసీ సభ్యులు

గ్రూపు అడ్మిన్‌పై, పోస్టు చేసిన వారిపై..

సోషల్ మీడియాలో రాజకీయ పార్టీల నాయకులను కించపరిచేలా ప్రజలను రెచ్చగొట్టేలా అంశాలను పోస్టులు చేస్తే క్రిమినల్ కేసులు నమోదయ్యే అవకాశం ఉంటుంది. అభ్యంతకర పోస్టులపై ఎవరైనా ఫిర్యాదు చేసినా, ఎన్నికల అధికారులు పరిశీలించిన గ్రూపు అడ్మిన్స్‌పై, పోస్టులు నమోదు చేసినా వ్యక్తిపై ఎన్నికల సంఘం రూపొందించిన చట్టం ప్రకారం పోలీసులు కేసులు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరుస్తారు.

క్రిమినల్ కేసులు నమోదు



ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులపై సోషల్ మీడియాలో నమోదు చేసే అభ్యంతకర పోస్టులు, విమర్శలు, ఆరోపణలు చేసే వారిని నిశితంగా పరిశీలిస్తున్నాం. ఇందుకోసం కలెక్టరేట్ ప్రత్యేక మీడియా మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేశాం. అభ్యంతకర పోస్టులు పెడితే సంబంధిత గ్రూప్ అడ్మిన్, పోస్టులు నమోదు చేసే వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసేలా చర్యలు తీసుకుంటాం.

– వల్లూరి క్రాంతి, సంగారెడ్డి జిల్లా కలెక్టర్

పొలిటికల్ హీట్

పదేళ్లు ఎంపీగా ఏం చేశారు?

కాంగ్రెస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేశ్ షెట్కార్

మునిపల్లి(అందోల్): ఎంపీ ఎన్నికల్లో గెలిపించి ఆదరిస్తే మునిపల్లి మండలాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని కాంగ్రెస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ అన్నారు. ఆదివారం మండలంలోని మునిపల్లిలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ షెట్కర్ మాట్లాడుతూ.. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, నేను తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఎంతగానో కృషి చేశామన్నారు. మాజీ ఎంపీ బీబీ పాటిల్ రోజుకో పార్టీ మారుస్తూ అధికారం కోసం బీజేపీలో చేరారన్నారు. 10 ఏళ్ల ఎంపీగా ఉండి ఏం అభివృద్ధి చేశారో ప్రజలకు చెప్పాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాంరెడ్డి, జెడ్పీటీసీలు అసత్ పటేల్, శ్రీశైలం స్వామి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సతీష్ కుమార్, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సురేశ్ షెట్కార్

బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి



మాట్లాడుతున్న వెంకట్రామిరెడ్డి

బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామి రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : లోక్‌సభ ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించాలని బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామి రెడ్డి కోరారు. ఆదివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీ కాలనీలో ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి జరిగిందన్నారు. ప్రజలందరూ తనను ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు గౌడ్, కౌన్సిలర్లు శ్రీశైలం, లచ్చిరాం నాయక్, నాగరాజు, బాలాజీ, తెల్లాపూర్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్, సీనియర్ నాయకులు సోమిరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సాగర్, శ్రీపాల్‌రెడ్డి, ఉమేశ్, మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కాంగ్రెస్ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీ కాలనీల్లో నెలకొన్న సమస్యల శాశ్వత పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కాంగ్రెస్ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు అన్నారు. ఆదివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు గేటెడ్ కమ్యూనిటీ కాలనీల్లో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాలనీవాసులు చెప్పిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు. తనను గెలిపిస్తే కేంద్ర నిధులతోపాటు రాష్ట్ర ప్రభుత్వ నిధులను కూడా తీసుకొని వచ్చి ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. యువత ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు పర్సా శ్యాంరావు, తెల్లాపూర్ మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్, వినోద్, పెంటయ్య, రవీందర్ పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న నీలం మధు

యువత లక్ష్యంతో ముందుకెళ్లాలి

డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్ బాబు

మెదక్ మున్సిపాలిటీ: యువత లక్ష్యాన్ని నిర్దేశించుకొని అందుకనుగుణంగా నిరంతరం శ్రమిస్తే కల సాకారమవుతుందని మెదక్ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్ బాబు విద్యార్థులకు సూచించారు. ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన కరాటే విద్యార్థులకు కార్యనిర్వాహక అధ్యక్షుడు రెంజుకి షటోకాన్ కరాటే క్లబ్ ఆఫ్ ఇండియా ఫౌండర్ అండ్ డైరెక్టర్ మల్లూరి నగేశ్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. ఆదివారం స్థానిక గుల్షన్ క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమానికి రమేశ్‌బాబు హాజరై మాట్లాడారు. కరాటే నేర్చుకోవడం ద్వారా క్రమశిక్షణతోపాటు శారీరదారుఢ్యం, మానసిక ఉల్లాసం లభిస్తాయన్నారు. జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజు విద్యార్థులకు విద్యతోపాటుగా శారీరక శ్రమ మానసిక ఉల్లాసం ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు కీర్తిస్వరాజ్, నిత్యన సిరి, విలోహిత్, సోఫియా, అగస్త్య, రవళి, కార్తీక్, ప్రణయ్, మణికంఠ, వైష్ణవి, అభిషేక్, సూరజ్, ఉమా దేవి, మణిదీప్‌లను అభినందించారు. కార్యక్రమంలో జూనియర్ లెక్చరర్ స్వర్ణలత, కరాటే మాస్టర్లు నగేశ్ , దినకర్, అరవింద్, మల్లేశ్, గణేశ్, పరశురాం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ రమేశ్‌బాబు, కరాటే మాస్టర్లు

కారు దిగి కాంగ్రెస్‌లోకి..

ఎన్నికల వేళ పార్టీని వీడుతున్న గులాబీ నేతలు

- పోలింగ్ సమీపిస్తున్న తరుణంలోనూ వలసలు
- అసెంబ్లీ ఎన్నికల్లోనూ జోరుగా కారెక్కిన నేతలు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: పార్లమెంట్ ఎన్నికల వేళ గులాబీ పార్టీకి వరుస ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. ప్రధానంగా మెదక్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో కీలక నేతలు బీఆర్‌ఎస్‌కు గుడ్ బై చెబుతున్నారు. ప్రజాప్రతినిధులు సైతం వలస బాట పట్టారు. పోలింగ్ దగ్గర పడుతున్న ఈ తరుణంలో కూడా ఒక్కొక్కరుగా ఆ పార్టీని వీడుతుండటం గమనార్హం. పార్టీని వీడుతున్న వారు ఎక్కువగా కాంగ్రెస్ కండువా కప్పుకుంటున్నారు.

నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి పక్షం రోజుల కిందట బీఆర్‌ఎస్‌ను వీడారు. ఈ నియోజకవర్గంలో కీలకమైన మదన్‌రెడ్డి పార్టీని వీడటం గులాబీ పార్టీకి గట్టి ఎదురు దెబ్బ తగిలినట్లయింది. ఇటీవల ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ అధ్యక్షుడు చిట్టి దేవేందర్‌రెడ్డి సైతం బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై చెప్పడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన దేవేందర్‌రెడ్డి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అలాగే గజ్వేల్ నియోజకవర్గంలో పార్టీ సీనియర్ నాయకులు భూంరెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేసిన ఎలక్షన్ రెడ్డి కూడా బీఆర్‌ఎస్‌ను వీడి హస్తం గూటికి చేరారు. సిద్దిపేట పట్టణానికి చెందిన పలువురు బల్దియా కౌన్సిలర్లు, సర్పంచులు కూడా గులాబీ పార్టీకి గుడ్‌బై చెప్పారు.



బీఆర్‌ఎస్‌ను వీడి సొంత గూటికి

మెదక్ నియోజకవర్గానికి చెందిన మ్యాడం బాలకృష్ణ ఇటీవల కాంగ్రెస్‌లో చేరారు. టీపీసీసీ పోస్టు ఉన్న మ్యాడం బాలకృష్ణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ పార్లమెంట్ ఎన్నికలకు వచ్చే సరికి బీఆర్‌ఎస్‌ను వీడి సొంత గూటికి చేరుకున్నారు. పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని బొల్లారం మున్సిపాలిటీకి చెందిన కౌన్సిలర్లు కూడా కారు దిగి కాంగ్రెస్‌లో చేరారు. మరోవైపు సంగారెడ్డి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని సదాశివపేట మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పిల్లోడి జయమ్మతో పాటు, పలువురు కౌన్సిలర్లు కారు దిగారు. తాజా సంగారెడ్డికి చెందిన మాజీ ఎమ్మెల్సీ ఆర్.సత్యనారాయణ కూడా బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. ఇలా మెదక్ పార్లమెంట్ పరిధిలో వరుసగా బీఆర్‌ఎస్‌ను వీడుతుండటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఐదు నెలల్లో సీన్ రివర్స్..

సరిగ్గా ఐదు నెలల కిందట కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లోకి వలసలు కొనసాగాయి. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆయా నియోజకవర్గాల్లో కీలక నాయకులు కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. తీరా రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో సీన్ రివర్స్ అయింది. బీఆర్‌ఎస్‌లో ఉన్న నేతలతో పాటు, కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు కూడా తిరిగి హస్తం గూటికి చేరుకోవడం గమనార్హం. ఇన్నాళ్లు బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అధికారాన్ని అనుభవించిన నాయకులు ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే హస్తం గూటికి చేరుతున్న నేతల తీరును చూసి రాజకీయ వర్గాలు ముక్కున వేలేసుకుంటున్నాయి. అధికారంలో ఉన్నన్ని రోజులు పదవులు అనుభవించిన నాయకులు.. అధికారం కోసమే వెళ్తున్నారని గులాబీ పార్టీ వర్గాలు విమర్శిస్తున్నాయి. ఈ నేతలు పోయినంత మాత్రాన పార్టీకి ఏ మాత్రం నష్టం లేదని, నిఖార్సయిన తెలంగాణ వాదులు, ఉద్యమకారులు గులాబీ పార్టీలోనే ఉన్నారని బీఆర్‌ఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి. స్వార్థ రాజకీయాల కోసం పార్టీని వీడిన వారితో తమకు ఎలాంటి నష్టం లేదని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

చేపల వేటకు వెళ్లి యువకుడు మృతి

- మృతదేహం కోసం గాలిస్తుండగా మరో వ్యక్తి మృత్యువాత
- కేరూర్ గ్రామంలో విషాదఛాయలు

వట్‌పల్లి(అందోల్): చెరువులో చేపల వేటకు వెళ్లిన ఓ యువకుడు మృతి చెందగా, అతడి మృతదేహాన్ని గాలింపునకు వెళ్లిన మరో వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఈ ఘటన వట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ కోటేశ్వర్‌రావు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కేరూరు గ్రామానికి చెందిన బరుగు కిరణ్(23) స్నేహితులతో కలిసి శనివారం అల్లాదుర్గం మండలం గడి పెద్దాపూర్ పెద్ద చెరువులోకి చేపల వేటకు వెళ్లాడు. కిరణ్ ప్రమాదవశాత్తు చెరువులో మునగడంతో వెంట వెళ్లిన స్నేహితులు గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ దొరకలేదు. కిరణ్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు విషయం తెలిసి చెరువు వద్దకు చేరుకొని రాత్రి వరకు గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఇంటికి వెళ్లిపోయారు. ఆదివారం ఉదయం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. ఇందులో చిన్నెల్లి కిష్టయ్య(52) యువకుడి కోసం వెతుకుతుండగా ప్రమాదవశాత్తు నీట మునిగి మృత్యువాత పడ్డాడు. సమాచారం అందుకున్న వట్‌పల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గజఈతగాళ్లను రప్పించి ఇద్దరి మృతదేహాలను వెలికి తీశారు. చేపల వేటకు వెళ్లి ఒకరు, అతడి గాలింపు కోసం వెళ్లిన మరొకరు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



కిరణ్(ఫైల్)



కిష్టయ్య(ఫైల్)

ప్రమాదవశాత్తు కారు దగ్ధం

అల్లాదుర్గం/టేక్మాల్(మెదక్): ప్రమాదవశాత్తు కారు దగ్ధమైన ఘటన అల్లాదుర్గం మండల పరిధిలోని ముస్లాపూర్ గ్రామ శివారులో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. సంగారెడ్డి వైపు నుంచి నారాయణఖేడ్ వైపు కారులో ఐదుగురు వెళ్తున్నారు. మార్గమధ్యలో ముస్లాపూర్ శివారులోకి రాగానే సంగారెడ్డి–నాందేడ్ 161 జాతీయ రహదారిపై కారులో మంటలు చెలరేగాయి. కారులో ఉన్నవారు అప్రమత్తమై దిగిపోయి గ్రీన్‌మ్యాట్‌లను తీసి బయటకు పడేశారు. దట్టమైన పొగలతో కారు పూర్తిగా దగ్ధమైంది. ఎండ వేడిమికి కారు దగ్ధంమైదని చెబుతున్నా ఉదయం 9 గంటల ప్రాంతంలో ఘటన జరగడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.



దగ్ధమవుతున్న కారు

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి

- భార్యకు తీవ్ర గాయాలు
- బైక్ పై వెళ్తుండగా డీసీఎం ఢీ

సిద్దిపేటకమాన్: బైక్‌ను డీసీఎం వ్యాన్ ఢీకొట్టిన ప్రమాదంలో భర్త మృతి చెందగా, భార్యకు గాయాలు అయ్యాయి. ఈ ఘటన సిద్దిపేట పట్టణ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం మేరకు.. కేసీఆర్ నగర్ డబుల్ బెడ్రూం కాలనీలో ఎండీ ఎదుల్ (45), నస్రీన్ దంపతులు నివాసం ఉంటున్నారు. ఎదుల్ తాపీ మేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం పని నిమిత్తం భార్యాభర్తలు బైక్‌పై సిద్దిపేట పట్టణం వైపు వస్తున్నారు. రంగీలా దాబా చౌరస్తా వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో కరీంనగర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న డీసీఎం వ్యాన్ వీరి బైక్‌ను ఢీకొట్టింది. బైక్‌పై ప్రయాణిస్తున్న ఎదుల్ తీవ్ర గాయాలతో మృతి చెందగా, భార్య నస్రీన్ తలకు గాయాలయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేశం తెలిపారు.

గడ్డం చేస్తూ.. ఓట్లు అడుగుతూ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్‌కు మద్దతుగా పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు బొమ్మల యాదగిరి ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఓ సెలూన్ షాపులో గడ్డం చేస్తూ తమ పార్టీ అభ్యర్థికే ఓటు వేయాలని అభ్యర్థించారు. నాయకులు ఈ విధంగా ప్రచారం చేయడంతో షాపునకు వచ్చిన కస్టమర్లు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.



గడ్డం చేస్తున్న యాదగిరి

మెజారి‘టీ’తో గెలిపించాలి

బెజ్జంకి(సిద్దిపేట): కాంగ్రెస్ కరీంనగర్ ఎంపీగా అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి రేఖ, కుటుంబసభ్యులు ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బెజ్జంకి లక్ష్మీనృసింహస్వామి, సాయిబాబా ఆలయాల్లో పూజలు చేశారు. కాంగ్రెస్ పార్టీతోనే పేద ప్రజలకు మేలు జరుగుతుందని ఒక్కసారి రాజేందర్‌రావుకు అవకాశమివ్వాలని కోరారు. అనంతరం ఓ హోటల్‌లో టీ చేస్తూ ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు రాచకిండ తిరుపతిగౌడ్, రాజేఖర్‌రెడ్డి, పోచయ్య, శ్రీనివాస్‌రెడ్డి, మంజుల, నర్సయ్య, మల్లేశం, డీవీ రావు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



టీ చేస్తున్న రాజేందర్‌రావు సతీమణి రేఖ

సంతలో ప్రచారం

జోగిపేట(అందోల్): జహీరాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న జైపాల్ నాయక్ ఆదివారం జోగిపేట సంతలో వినూత్నంగా ప్రచారాన్ని చేపట్టారు. చౌటకూరు మండలం బొమ్మారెడ్డి గూడెంకు చెందిన జైపాల్ నాయక్ తనకు మద్దతుగా గిరిజన మహిళలను తీసుకొచ్చి ప్రచారం నిర్వహించారు. స్థానిక బిడ్డనైన నేను అందుబాటులో ఉంటానని, ఉంగరం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని జైపాల్ నాయక్ కూరగాయల విక్రయదారులను కోరారు. కార్యక్రమంలో గిరిజన తండా నాయకులు రమేశ్, శివాజీ, జస్వంత్, కిరణ్, అకేష్, నరేందర్ రవి, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



ఓటు అభ్యర్థిస్తున్న జైపాల్ నాయక్